నమస్తే తెలంగాణ
కరీంనగర్
3 | కరీంనగర్, శుక్రవారం 7 జూన్ 2024 | KARIMNAGAR

నెల రోజులకే నెర్రెలు

ఓదెల- కొలనూర్ మధ్య పగుళ్లు చూపిన తారురోడ్డు

నాణ్యాతాలోపంతో
ఓదెల-పెద్దపల్లి తారురోడ్డు

ఓదెల, జూన్ 6 : ఓదెల టూ పెద్దపల్లి రోడ్డు నిర్మాణంలో భాగంగా కొలనూరు దాకా నెల క్రితం తారురోడ్డు వేశారు. అందుకు ₹10కోట్ల దాకా వెచ్చించారు. అయితే రెండురోజుల క్రితం కురిసిన చిన్నవర్షానికే ఈ రోడ్డు పగుళ్లు తేలింది. ఇరుపక్కల పోసిన మట్టికొట్టుకపోవడంతో ప్రమాదకరంగా తయారైంది. కాంట్రాక్టర్ నాణ్యాతా ప్రమాణాలు పాటించలేదని స్థానికులు ఆరోపించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

అర్బన్ బ్యాంకుపై గులాబీ జెండా

- పాలకవర్గ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయభేరి
- 12 స్థానాలకు ఎనిమిది మంది అభ్యర్థుల విజయం
- ఫలించిన కేటీఆర్ వ్యూహం
- విజయోత్సహంలో శ్రేణులు

గెలిచిన బీఆర్ఎస్ మద్దతుదారులను అభినందిస్తున్న నాయకులు

రాజన్న సిరిసిల్ల, జూన్ 6 (నమస్తే తెలంగాణ)/సిరిసిల్ల టౌన్: సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంకుపై గులాబీ జెండా ఎగిరింది. 12 స్థానాల్లో ఎనిమిది కైవసం చేసుకుని సత్తా చాటింది. ఐదేళ్లకోసారి జరిగే పాలకవర్గ ఎన్నికలను కాంగ్రెస్, బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుని, పట్టు కోసం విశ్వప్రయత్నం చేసినా బీఆర్ఎస్ విజయదందుభి మోగించింది. తెలంగాణ ఆవిర్భావం నుంచి వరుసగా గెలుస్తూ వచ్చిన పార్టీ మూడోసారి హ్యాట్రిక్ సాధించింది. ఎనిమిది స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు, కాంగ్రెస్ 1, బీజేపీ 1, ఇండిపెండెంట్లు ఇద్దరు గెలిచారు. ఇండిపెండెంట్లలో గుడ్ల సత్యానందం బీఆర్ఎస్‌లో చేరగా, బీఆర్ఎస్ మద్దతుదారుల సంఖ్య 9కి చేరింది. నేడు చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక జరగనున్నది. కాగా, అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యూహం ఫలించింది. ఎన్నికల ముందు రెండు రోజులుగా ఓటర్లకు స్వయంగా ఫోన్ చేసి పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రామన్న చేసిన అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఓటర్లు బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి తమ కృతజ్ఞతను చాటుకున్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ డబ్బులతో ఓట్లు కొనేందుకు చేసిన కుట్రలకు ఓటర్లు చెక్‌పెట్టి బీఆర్ఎస్‌కే పట్టంగట్టారు. పలువురు అభ్యర్థులు మందు, విందు, ఓటుకు నోటు భారీగా పంచి పెట్టారు. అయినా ఓటర్లకు ఎన్నిరకాలుగా ఎరచూపినా కూడా? వారి మాయలో పడకుండా బీఆర్ఎస్ అభ్యర్థులకే ఓటు వేసి రామన్నపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. కాగా, బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించినందుకు కేటీఆర్ ఓటర్లందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అభ్యర్థులు గెలిచిన సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు విజయోత్సవ సంబురాలు జరుపుకున్నారు. పటాకులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు.

కోడ్ క్లోజ్

ముగిసిన ఎన్నికల నియమావళి

కరీంనగర్ కలెక్టరేట్, జూన్ 6 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సుదీర్ఘకాలం కొనసాగిన ఎన్నికల కోడ్ గురువారంతో ముగిసింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం గురువారం సాయంత్రం కోడ్ ఎత్తివేస్తూ, ఉత్తర్వులు విడుదల చేసింది. మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన సీఈసీ, ఆ వెంటే కోడ్‌ను కూడా అమల్లోకి తెస్తున్నట్టు ప్రకటించింది. సుమారు రెండు నెలల ఇరవై రోజుల పాటు ఎన్నికల నియమావళి ఉండగా, సాధారణ ప్రజలు కొంతమేర ఇబ్బంది పడాల్సి వచ్చింది. పేద, మధ్య తరగతి ప్రజలు తమ సమస్యలు చెప్పుకునేందుకు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి కోడ్ కారణంగా తాత్కాలిక బ్రేక్ పడ్డది. దీంతో ప్రజా సమస్యల పరిష్కారం పెండింగ్‌లో పడింది. ఇప్పుడు కోడ్ ఎత్తివేయడంతో ఇకనైనా తమ సమస్యలపై జిల్లా అధికారులు దృష్టి సారిస్తారని జిల్లా ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. అలాగే, రైతు రుణమాఫీ, కొత్త పింఛన్లు, రేషన్‌కార్డుల మంజూరుపై కూడా ప్రభుత్వం హామీ ఇవ్వడంతో రైతులు, సామాన్యులు వేచిచూస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో వాన

జగిత్యాల టౌన్: కొత్త బస్టాండ్ చౌరస్తాలో పడుతున్న వర్షం

వేములవాడ/ రుద్రంగి/ జగిత్యాలరూరల్/ జగిత్యాలటౌన్, జూన్ 6: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గురువారం మోస్తారు వాన పడ్డది. పలుచోట్ల ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో దంచికొట్టింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో కట్టు కాలువ సమీపంలో విద్యుత్ స్తంభం పై పిడుగు పడి, లైన్ తెగిపోయింది. వేములవాడరూరల్ మండలం అచ్చన్నపల్లిలో పిడుగుపాటుకు రెండు ఆవులు మృతిచెందాయి. రుద్రంగిలోని కొనుగోలు కేంద్రాల్లో అరబోసిన ధాన్యం మ్యాచర్ వచ్చినప్పటికీ కొనుగోలు చేయకపోవడంతో వర్షానికి తడిసి ముద్దయింది. రెండు నెలలైనా ధాన్యం తూకం వేయలేదని, పూర్తిగా అధికారుల నిర్లక్ష్యంతోనే నష్టపోయామని రైతులు వాపోయారు. తడిసిన ధాన్యాన్ని కొనాలని డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్‌లో అమరగొండ ఎల్లయ్య అనే గొర్రెల కాపరి పిడుగుపాటుతో గాయాలపాలయ్యాడు. జగిత్యాల రూరల్ మండలం రఘురాముల కోటలో దండె రఘుకు చెందిన రేకులషెడ్డుపై తాటి చెట్టు విరిగి పడింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూలేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

పత్తి రైతు మెడపై హెచ్‌టీ విత్తన కత్తి!

- మళ్లీ హెర్బిసైడ్ టాలరెంట్ విత్తనాల ముప్పు
- ఓ చోట నిఘా.. మరోచోట దందా
- పొరుగు రాష్ట్రాల నుంచి సరఫరా
- పల్లెల్లో యథేచ్ఛగా విక్రయం?
- గత ప్రభుత్వంలో పూర్తిగా నిషేధం
- ఇప్పుడు మళ్లీ చాపకిందనీరులా..
- సాగు చేస్తే భూసారం దెబ్బతినే ప్రమాదం
- అధికారుల తీరుపై విమర్శలు

పత్తి రైతుపై మళ్లీ హెర్బిసైడ్ టాలరెంట్ (హెచ్‌టీ) విత్తన కత్తి వేలాడుతున్నది. గ్లైఫోసెట్ అనే గడ్డి మందును తట్టుకునే జన్యువుతో రూపొందించిన ఈ విత్తనాల ద్వారా కాలుష్యంతోపాటు నేల సారం దెబ్బతినే ప్రమాదముండగా.. గత కేసీఆర్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. కానీ, ప్రస్తుతం మళ్లీ ముప్పు కనిపిస్తున్నది. పూర్తి స్థాయి పర్యవేక్షణ లేక ఈ సీడ్ చాపకింద నీరులా పల్లెలకు చేరుతున్నది. కరీంనగర్ జిల్లాలో కొందరు బ్రోకర్లు గ్రామాల్లో తిరుగుతూ.. బోల్‌గార్డు (బీజీ)-3 విత్తనాల పేరిట రైతులకు అంటగడుతున్నట్టు తెలుస్తుండగా, అధికారుల తనిఖీల తీరు విస్తుగొలుపుతున్నది. దందా పల్లెల్లో జరుగుతుంటే.. పట్టణాల్లో నిఘా పెట్టి చేతులు దులుపుకొంటున్న తీరు తీవ్ర విమర్శలకు తావిస్తున్నది.

కరీంనగర్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): గ్లైఫోసెట్ అనే గడ్డి మందును తట్టుకునే జన్యువుతో రూపొందించిన హెచ్‌టీ పత్తి విత్తనాల ద్వారా కాలుష్యంతోపాటు నేల సారం దెబ్బతింటున్నదని గత ప్రభుత్వాలు నిషేధించాయి. హెచ్‌టీ పత్తి విత్తనాలు సాగు చేసిన రైతులు పెట్టుబడి ఖర్చులు తగ్గించుకునే నేపథ్యంలో గ్లైఫోసెట్ తప్పని సరిగా వాడుతారని భావించాయి. ఈ మందును కేవలం తేయాకు తోటల్లో మాత్రమే వాడేందుకు అనుమతి ఉన్నది. అయితే ఇప్పుడు పత్తి సాగులో కూడా వాడాలంటే కొన్ని కంపెనీలు ఈ గడ్డి మందును తట్టుకునే జన్యువుతో హెచ్‌టీ పత్తి విత్తనాలను రూపొందించారు. గతంలో కొందరు లైసెన్స్‌డ్ డీలర్లు కూడా వీటిని విక్రయించినట్లు వ్యవసాయ అధికారులు గుర్తించారు. ఇప్పుడు కొందరు బ్రోకర్లు గ్రామాల్లో పర్యటిస్తూ బోల్‌గార్డు (బీజీ)-3 విత్తనాల పేరిట రైతులను బురిడీ కొట్టించి హెచ్‌టీ విత్తనాలను అంటగడుతున్నట్లు తెలుస్తున్నది. గడ్డి మందును తట్టుకునే సామర్థ్యం ఉందని ప్రచారం చేయడంతో రైతులు ఎక్కువ ధర అయినా సరే చెల్లించి కొనుగోలు చేస్తున్నట్టు తెలుస్తున్నది. కరీంనగర్, హుజూరాబాద్ తదితర చోట్ల గతంలో పెద్ద మొత్తంలో ఈ విత్తనాలను అధికారులు పట్టుకున్నారు. బట్ట సంచుల్లో తెచ్చి ఆయా గ్రామాల్లో కొందరు రైతుల ద్వారానే తోటి రైతులకు దళారులు విక్రయిస్తున్నట్టు తెలుస్తున్నది. అయితే హెచ్‌టీ విత్తనాలతోపాటు గ్లైఫోసెట్‌ను కూడా రహస్యంగా రైతులకు విక్రయిస్తున్నట్లు సమాచారం. వీటికి తోడు అన్‌ట్రీటెడ్ పత్తి విత్తనాలు కూడా దళారుల ద్వారా గ్రామాలకు చేరుతున్నట్టు తెలుస్తున్నది.

పట్టణాలకే పరిమితమైన నిఘా

నకిలీ విత్తనాలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు వ్యవసాయ, పోలీస్ అధికారులతో టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశారు. మండల, వ్యవసాయ డివిజన్, జిల్లా స్థాయిల్లో ఈ టాస్క్‌ఫోర్స్ బృందాలు ఆయా విత్తన డీలర్ల దుకాణాల్లో తనిఖీలు చేశాయి. అంతేకాకుండా ట్రాన్స్‌ఫోర్ట్ సంస్థల ద్వారా ఇతర వస్తువుల పేరిట జిల్లాకు చేరే ముప్పు ఉందని భావించి, సదరు సంస్థలపైనా నిఘా పెట్టారు. తమ పరిధిలోని విత్తనాల దుకాణాల్లో గత నెలలో విస్తృతంగా తనిఖీలు చేశాయి. నకిలీ విత్తనాలను ఏ విధంగా అరికట్టాలనే విషయమై, పత్తి విత్తనాల సాగుపై గ్రామాల్లో అవగాహన సదస్సులు కూడా నిర్వహించారు. మొక్కుబడిగా సాగిన ఈ సదస్సుల వల్ల రైతుల్లో పెద్దగా అవగాహన కలిగింది లేదు. అయితే అధికారులు పట్టణాలు, మండల కేంద్రాలు, మున్సిపాలిటీల్లో మినహా గ్రామీణ ప్రాంతాలపై ఎక్కువగా నిఘా పెట్టింది లేదు. దీంతో ఒక రైతు నుంచి మరో రైతుకు ఈ నిషేధిత పత్తి విత్తనాలను విక్రయిస్తున్నట్టు తెలుస్తున్నది. ఇప్పటికే కరీంనగర్ రూరల్ మండలం, రామడుగు, గంగాధర, తిమ్మాపూర్ తదితర మండలాల్లో రైతులు హెచ్‌టీ పత్తి విత్తనాలు కొనుగోలు చేసుకున్నట్లు తెలుస్తున్నది. గతంలో రామడుగు మండలంలోని పలు గ్రామాలకు చెందిన కొందరు ఈ దందా విపరీతంగా చేశారు. ఇతర జిల్లాల్లోని టాస్క్‌ఫోర్స్ బృందాల తనిఖీల్లో హెచ్‌టీ పత్తి విత్తనాలు, గ్లైఫోసెట్ గడ్డి మందు లభిస్తుంటే ఇప్పటి వరకు జిల్లాలోని టాస్క్‌ఫోర్స్ మాత్రం ఒక్క చోట కూడా వీటిని పట్టుకున్న దాఖలాలు కనిపించడం లేదు.

నిషేధిత గడ్డిమందు, నకిలీ పత్తి విత్తనాలు

అత్యంత ప్రమాదకరం

హెచ్‌టీ పత్తి విత్తనాల సాగు అత్యంత ప్రమాదకరమైనది. ఈ తరహా విత్తనాలు సాగు చేస్తే గడ్డి నివారణ తప్పుతుందని సాగు వ్యయం తగ్గుతుందని రైతులు భావిస్తుంటారు. ఈ విషయాన్నే ఎక్కువ ప్రచారం చేసుకుంటున్న దళారులు గ్రామాలకు నేరుగా వెళ్లి రైతులకు విక్రయిస్తున్నట్టు తెలుస్తున్నది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి ఈ విత్తనాలు తెస్తున్నట్టు తెలుస్తున్నది. హెచ్‌టీ పత్తి విత్తనాలు సాగు చేసి గ్లైఫోసెట్‌ను వాడినట్లయితే భూ సారం పూర్తిగా దెబ్బతిని కొన్నాళ్ల వరకు నేల పూర్తిగా గుల్లబారి పోతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సారం పూర్తిగా దెబ్బతిని ఇసుక మాదిరిగా మారిపోతుందని హెచ్చరిస్తున్నారు. దీని వల్ల పర్యావరణానికి కూడా ప్రమాదం ఉంటుందని, అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హెచ్‌టీ పత్తి విత్తనాలను, గ్లైఫోసెట్ గడ్డి మందును నిషేధించామని చెబుతున్నారు. గత ప్రభుత్వం ఈ విత్తనాలపై ఉక్కుపాదం మోపింది. హెచ్‌టీ పత్తి విత్తనాలను గుర్తించేందుకు రైతులకు టెక్నికల్ కిట్స్ కూడా అందించింది. ఫలితంగా కొన్నాళ్లపాటు దళారులు తెలంగాణ వైపు తొంగి చూడలేదు. అయితే ఈ సీజన్‌లో మాత్రం విత్తనాలు విచ్చలవిడిగా రైతులకు అందుబాటులోకి వస్తున్నట్లు తెలుస్తున్నది. ఇప్పటికైనా అధికారులు ఈ విత్తనాలను సాగు చేయకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

60కిలోల నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

రాంనగర్, జూన్ 6: ఆంధ్రా నుంచి మంచిర్యాల జిల్లాకు నకిలీ విత్తనాలు తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. రూరల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ కుమార్ వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం కోయవారిపాలెం గ్రామానికి చెందిన చందు నాగేశ్వర రావు ఇరువై ఏండ్ల క్రితమే మంచిర్యాల జిల్లా బీమారం హామ్లెట్ గ్రామం గుంటూరుపల్లిలో స్థిరపడ్డాడు. గురువారం పత్తిపాడు నుంచి ఓ వాహనంలో ₹1.20లక్షల విలువైన 60 కిలోల నకిలీ విత్తనాలను గుంటూరుపల్లికి తీసుకెళ్తున్నాడు. కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గోపాల్‌పూర్ క్రాస్ రోడ్ వద్ద కరీంనగర్ టాస్క్ ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్, రూరల్ పోలీసులు సంయుక్తంగా వాహన తనిఖీలు చేస్తుండగా.. నాగేశ్వరరావు వాహనాన్ని సోదా చేశారు. అందులో 60 కిలోల నకిలీ విత్తనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై ఐపీసీ సెక్షన్ 420, 3(1) ఆఫ్ సీడ్స్ యాక్ట్, సెక్షన్ 8, 15(1) ఆఫ్ సీడ్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. తనిఖీల్లో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ సృజన్ రెడ్డి, టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, కరీంనగర్ రూరల్ ఎస్ఐ శేఖర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రంగపేటలో ఎండిపోతున్న నారు మడులు

సాగుకు కరెంట్ కష్టాలు

- వానకాలం మొదట్లోనే కోతలు
- రంగంపేటలో నీటి తడి అందక ఎండిపోతున్న నారు మడులు
- ఆగమైపోతున్న రైతులు
- పట్టని అధికారులు

మానకొండూర్ రూరల్, జూన్ 6: మళ్లీ కరెంట్ కష్టాలు మొదలయ్యాయి. రైతన్నను ఆగం చేస్తున్నాయి. మొన్న యాసంగిలో కాంగ్రెస్ సర్కారు అప్రకటిత కోతలతో పంటలన్నీ ఎండిపోగా, ఇప్పుడు వానకాలం సీజన్ ప్రారంభానికి ముందు కూడా అలాంటి పరిస్థితులే కనిపిస్తున్నాయి. పల్లెల్లో కరెంట్ ఎప్పుడు పోతుందో.. ఎప్పుడు ఉంటుందో తెలియకుండగా.. ఇప్పటికే పోసిన నారుమడులకు నీళ్లు పెట్టే దారి లేక ఎండిపోయే దుస్థితి వచ్చింది. ఇప్పటికే అక్కడక్కడా ఎండిపోతుండగా, రైతులోకం ఆగ్రహిస్తున్నది. మానకొండూర్ మండలం రంగపేటలో రైతులు గోపు ఈశ్వర్ రెడ్డి, కొత్త తిరుపతి రెడ్డి, కొత్త శ్రీకాంత్ రెడ్డి, ముదిగంటి జీవన్ రెడ్డితో మరి కొందరు ఇటీవల నారు మళ్లను తయారు చేసి మొలకను చల్లారు. రోజు వారీగా నారు పోసి తడి ఇస్తున్నారు. కరెంట్ ఇక్కట్లతో ఆగమవుతున్నారు. మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి బుధవారం రాత్రి 11 గంటల దాకా కరెంట్ లేక.. మడులకు నీరు పెట్టుకోలేక నానా ఇబ్బందులు పడ్డారు. పవర్ కట్ అయినప్పుడల్లా ఇదే పరిస్థితి ఉంటున్నదని వాపోతున్నారు. విద్యుత్ అధికారులకు ఫోన్ చేసి సమస్యను చెప్పినా పట్టించుకోవడం లేదని, నిర్లక్ష్యపు సమాధానాలు చెబుతున్నారని రైతులు మండిపడుతున్నారు. బీఆర్ఎస్ సర్కారులోనే బాగున్నదని, 24 గంటల కరెంట్‌తో ఏ బాధా లేకుండా పంటలు పండించుకున్నామని చెబుతున్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

బాలభవన్ వేసవి క్యాంపు ముగింపు వేడుకలు

ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు

నృత్యం చేస్తున్న చిన్నారులు

కమాన్‌చౌరస్తా, జూన్ 6: క్లాసికల్, వెస్టన్ డ్యాన్స్‌లు..ఫోక్ అండ్ రాక్ సాంగ్స్‌తో బాలభవన్ వేసవి క్యాంపు ముగింపు వేడుకలు ఉల్లాసంగా..ఉత్సాహంగా సాగాయి. కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో 45 రోజుల పాటు సాగిన ట్రైనింగ్ క్యాంపు అట్టహాసంగా ముగిసింది. ఈ సంవంత్సరం వేసవి శిక్షణకు భారీ స్పందన రాగా, దాదాపు 760 మంది విద్యార్థులు శిక్షణలో పాల్గొన్నారు. శ్రీధర్, రాధాకృష్ణ, కృష్ణ కుమార్, సూర్యశ్రీ, అనూప్, రాధిక, మల్లిక, సుహాసిని శిక్షణ ఇచ్చారు. గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన వేడుకలను బాలభవన్ నిర్వాహకురాలు కే మంజులాదేవి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తాము నేర్చుకున్న డ్యాన్స్, క్లాసికల్ డ్యాన్స్, సంగీతం, మృదంగం, డ్రాయింగ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, యోగా, అబాకస్‌ను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఆటపాటలతో హోరెత్తించారు. చెస్ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

అప్పులు బరువై.. బతుకు భారమై

సౌదీలో గల్ఫ్‌కార్మికుడు ఆత్మహత్య

వెంకటి (ఫైల్)

మల్లాపూర్, జూన్ 6: అప్పుల భారం పెరిగిపోవడంతో కలత చెందిన వ్యక్తి ఎడారి దేశంలో బలవన్మరణానికి పాల్పడ్డాడు. బతుకు దెరువు కోసం వెళ్లిన సౌదీ అరేబియాలో ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. మల్లాపూర్ మండలం వేంపల్లికి చెందిన కండెల వెంకటి (41) ఉపాధి కోసం అప్పులు చేసి 15 ఏండ్ల క్రితం గల్ఫ్ బాట పట్టాడు. సౌదీ అరేబియాలోని ఓ కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తూ బతుకు దెరువు సాగిస్తున్నాడు. రెండు నెలల క్రితం సొంతూరికి వచ్చిన ఆయన తిరిగి వెళ్లాడు. అయితే వేతనం అంతంత మాత్రమే ఉండడంతో వచ్చిన డబ్బులు కుటుంబపోషణ, పిల్లల చదువులకే సరిపోయేది. అయితే తెచ్చిన అప్పుకు వడ్డీలు పెరిగిపోవడం.. తీర్చే దారితెలియక తీవ్ర మనోవేదనకు గురయ్యేవాడు. తరచూ భార్యకు ఫోన్‌చేసి ఆవేదన వెల్లగక్కేవాడు. ఈ క్రమంలో పని చేసే చోట గురువారం ఉరేసుకున్నాడు. తోటి కార్మికుల ద్వారా సమాచారం అందుకున్న మృతుడి భార్య రాధ, బోరున విలపించారు. కొడుకు, ఇద్దరు బిడ్డలను ఎలా సాదేదని కన్నీళ్లపర్యంతమయ్యారు. కాగా, ప్రజాప్రతినిధులు చొరవచూపి వెంకటి మృతదేహాన్ని సాధ్యమైనంత తొందరగా తెప్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యార్థిని అభినందిస్తున్న దాసరి మనోహర్ రెడ్డి

ప్రత్యేక ప్రణాళికతోనే ఉత్తమ ఫలితాలు

ట్రినిటీ ఫౌండర్ దాసరి మనోహర్‌రెడ్డి

కమాన్‌చౌరస్తా, జూన్ 6: ప్రత్యేక ప్రణాళిక, నిష్ణాతులైన అధ్యాపకుల బోధనతోనే ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని ట్రినిటీ విద్యాసంస్థల ఫౌండర్ దాసరి మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. నీట్, జేఈఈ, ఎంసెట్‌లో తమ కళాశాలల విద్యార్థులు సత్తా చాటారని తెలిపారు. నీట్‌లో మెరుగైన ర్యాంకులు సాధించిన విద్యార్థులను కరీంనగర్ వావిలాలపల్లిలోని ప్లైం క్యాంపస్‌లో అభినందించారు. అనంతరం మాట్లాడుతూ ట్రినిటీ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని వివరించారు. సాధారణ విద్యార్థులతో పటిష్టమైన ప్రణాళిక, ఒత్తిడి లేని విద్యావిధానంతో ఈ ర్యాంకులు సాధించడం గొప్పగా భావిస్తున్నామని చెప్పారు. కళాశాలకు చెందిన ముసాబ్ హుస్సేన్ (685), నిఖిల్ (681), సయ్యద్ ముజకిర్ అలీ (676), శశాంక్ (671), ఆదిత్య (670), కరణ్ సింగ్ (667), సందీప్ కుమార్ (665), అజిత్ కుమార్ (657), వివేక్ సిద్ధార్థ్ (655) మార్కులు, మాళవిక (651), ముజమ్మిల్ ఖాన్ (633), స్ఫూర్తి 599తో పాటు పలువురు 450పై మార్కులు సాధించారని చెప్పారు.

13లోగా ఫీజు చెల్లించాలి

కమాన్‌చౌరస్తా, జూన్ 6 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో ఎల్ఎల్‌బీ నాలుగు, ఐదో సెమిస్టర్, ఎల్ఎల్ఎం ఐదో సెమిస్టర్ ఫీజు ఈ నెల 13వ తేదీలోగా చెల్లించాలని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 13వ తేదీ దాటితే అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటుందని, ఈ నెల 18వ తేదీ వరకు ₹300తో కలిపి కట్టవచ్చని చెప్పారు.

- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571